సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 17 । జనవరి । 2025



మధురస్మృతులతో..
వృత్తి, ఉద్యోగాల రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారు సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి.. మధుర జ్ఞాపకాలతో తిరిగి వెళ్తున్నారు. 8లో



30 ఏళ్లకే బీపీ, షుగర్
మారుతున్న జీవన విధానంతో పలువురు 30 ఏళ్ల వయసులోనే బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. వైద్యుల సూచనలతో కథనం.. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 15°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త అధికంగానే ఉంటాయి. తెల్లవారుజామున, రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన, హారతి, మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

కొత్తగూడెంఅర్బన్ : 2025 – 26 విద్యా సంవత్సరంలో పాలేరులోని జవహర్ నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం(18వ తేదీ) పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా నుంచి 1,462 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, జిల్లాలో 8 కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అశ్వారావుపేట జెడ్పీహెచ్‌ఎస్, భద్రాచలం కొర్రాజులగుట్ట జెడ్పీహెచ్‌ఎస్, భద్రాచలం జీహెచ్‌ఎస్, బూర్గంపాడు జీహెచ్‌ఎస్, ఇల్లెందు జేబీఎస్, ఇల్లెందు ఎస్‌సీహెచ్‌ఎస్, కొత్తగూడెంలోని బాబుక్యాంపు, చుంచుపల్లి పాఠశాలల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాన్ని ముందురోజే గుర్తించాలని, పరీక్ష రోజు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు(9989027943)ను సంప్రదించాలని తెలిపారు.

20న పీఎం జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా

బూర్గంపాడు: మండలంలోని కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 20వ తేదీన ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ధర్మాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన వారంతా ముందుగా www. apprentice shipindia. org. in వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జత చేసి అప్రెంటిస్‌షిప్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల ప్రిన్సిపాళ్లు, పరిశ్రమల యాజమాన్యాలు తమ పరిధిలోని అప్రెంటిస్ ఖాళీల వివరాలతో మేళాకు హాజరు కావాలని కోరారు.

అమెరికా 'టీ పాడ్' అధ్యక్షురాలిగా కొత్తగూడెం వాసి



మేకల అనురాధ

కొత్తగూడెంటౌన్: అమెరికాలోని డల్లాస్ ప్రాంతంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న 'టీ పాడ్' సంస్థ అధ్యక్షురాలిగా కొత్తగూడేనికి చెందిన మేకల అనురాధ ఎన్నికయ్యారు. కొత్తగూడెంలోనే విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె హైదరాబాద్, ఆ తర్వాత బెంగళూరు, చెన్నై, సింగపూర్, జపాన్, కెనడాతో పాటు ఇప్పుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూనే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అంతేకాక అక్కడి వారు తెలుగు సంప్రదాయాలకు దూరం కాకుండా బతుకమ్మ, వనభోజనాలు, దసరా, సంక్రాంతి, దీపావళి తదితర వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 2017లో తెలంగాణ పీపుల్స్ అసోసియేషన్ ఆఫ్ డల్లాస్ (టీపాడ్)లో వలంటీర్‌గా చేరిన ఆమె ఇప్పుడు అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అనురాధకు కొత్తగూడెంలోని ఆమె స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి

మణుగూరు టౌన్: బీటీపీఎస్ రైల్వే ట్రాక్, యాష్‌పాండ్ పనులు వేగంగా పూర్తి చేయాలని జెన్‌కో హెచ్‌ఆర్ డైరెక్టర్ అజయ్ అధికారులకు సూచించారు. బీటీపీఎస్‌ను గురువారం సందర్శించిన ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రధాన ద్వారం గేట్ వద్ద జరుగుతున్న సివిల్, రైల్వే ట్రాక్, యాష్‌పాండ్ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఈ బిచ్చన్న, రాంప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పచారీ.. పరేషాన్!



నిర్మానుష్యంగా ఉన్న కొత్తగూడెంలోని పెద్దబజార్ వ్యాపార సముదాయాలు



సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు నుంచే బెల్లం, తెల్ల నువ్వులు, పామాయిల్, రిఫైన్డ్ ఆయిల్, శనగపిండి తదితర వస్తువులకు విపరీతమైన గిరాకీ ఉండేది. షాపుల్లో ప్యాకింగ్ వర్కర్లు క్షణం తీరిక లేకుండా యంత్రాల్లా పని చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చింది. పండగ వేళ కిరాణా షాపుల వైపు చూసేవారు తగ్గిపోయారు. మరో వైపు కాలు పెట్టేందుకు వీల్లేకుండా కస్టమర్లతో కిటకిటలాడే వస్త్ర దుకాణాలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. కావాల్సిన వస్తువులు, వస్త్రాలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడుతున్నారు. లేదంటే బడా షాపింగ్ మాళ్లలో క్యూ కడుతున్నారు. ఫలితంగా పండుగంతా.. అయితే ఆన్‌లైన్ లేదంటే ఔట్ సోర్సింగ్ అన్నట్టుగా మారింది. –సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఆన్‌లైన్ షాపింగ్‌తో వెలవెలబోతున్న కిరాణా కొట్లు

- బడా మాల్స్‌తో వస్త్ర దుకాణాలపైనా ప్రభావం
- సంప్రదాయ మార్కెట్‌లో తగ్గిపోతున్న అమ్మకాలు
- ప్రధాన మార్కెట్లలో ఇరుకుగా మారిన రోడ్లు, పార్కింగ్ కష్టాలు

పార్కింగ్ కష్టాలూ కారణమే..

ఎన్ని మార్పులు చోటుచేసుకున్నా సంప్రదాయ మార్కెట్‌లోనే కొనాలి అనుకునే వారు కూడా ఉంటుంటారు. అయితే వీరు ఇప్పుడు మార్కెట్‌కు రాలేని పరిస్థితి నెలకొంది. పెరిగిన వాహనాల రద్దీ కారణంగా అన్ని పట్టణాల్లో ప్రధాన మార్కెట్ రోడ్లన్నీ ఇరుకుగా మారిపోయాయి. కొత్తగూడెంలో చిన్నబజార్, పెద్దబజార్, ఎంజీ రోడ్డు, ఇల్లెందులో ఆంబజార్, పాల్వంచలో శాస్త్రి రోడ్డు, భద్రాచలంలో యూబీ రోడ్డు, మణుగూరులో కూరగాయల మార్కెట్ వంటి చోట్ల వాహనాల పార్కింగ్ ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. కార్లే కాదు ఒక్కోసారి బైక్‌లపై వెళ్లి ఇక్కడ షాపింగ్ చేయడం కూడా కష్టంగా ఉంటోంది. ప్రధాన మార్కెట్లకు కస్టమర్లు సులువుగా వచ్చిపోయేందుకు వీలుగా పాత్‌వేలు, పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని వ్యాపార వర్గాలు కోరుతున్నాయి.

కమ్యూనిటీ హెల్ప్..

ప్రతీ ఊరిలో.. ఇంకా చెప్పాలంటే ప్రతీ ఇంట్లో హైదరాబాద్, బెంగళూరు, ముంబయి వంటి నగరాల్లో ఉండేవారు పెరిగిపోయారు. వీరంతా పండుగకు సొంతూళ్లకు వస్తుంటారు. ఇలా వచ్చేప్పుడు తమ వాళ్లకు అవసరమైన వస్తువులు నగరాల్లో తక్కువ ధరకే కొనుగోలు చేసి తీసుకొచ్చే కమ్యూనిటీ హెల్ప్ సంస్కృతి మరోసారి ఊపందుకుంటోంది.

స్మార్ట్ ఫోన్ రాకతో..

ఇంటర్నెట్ జీవితంలో భాగమైంది. స్మార్ట్ ఫోన్ శరీరంలో ఓ పార్ట్‌గా మారిపోయింది. దీంతో నిత్య జీవితంలోనే కాదు.. పండుగల్లోనూ సరికొత్త మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్పుల దెబ్బకు సంప్రదాయ మార్కెట్ వ్యవస్థ కుదేలైపోతోంది. చిన్న పట్టణాల్లోనూ మాల్స్ వెలుస్తున్నాయి. ఈ కామర్స్ రయ్‌రయ్ మని దూసుకుపోతోంది. దీంతో వస్త్రాలు, చెప్పులే కాదు సబ్బులు, షాంపూలు కూడా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టేస్తున్నారు. కాదంటే దగ్గర్లో ఉన్న షాపింగ్ మాల్‌కి వెళ్లి సందడి చేస్తున్నారు. ఈ కామర్స్ సైట్స్, బడామాళ్లలో ఊరించే డిస్కౌంట్లు, లభించే వెరైటీలు ముందుగా వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఆ తర్వాత క్రెడిట్ కార్డులు, పే లేటర్, ఆన్‌లైన్ లోన్ల వంటి ఆప్షన్లు ఈ రెండు రంగాలకు మరింత ఊతం ఇస్తున్నాయి. దీంతో రెగ్యులర్ మార్కెట్‌లో ఉండే బట్టలు, కిరాణా దుకాణాలు బేరం లేక షట్టర్లు మూతేసే పరిస్థితి నెలకొంటోంది. కరోనా ముందువరకు సంక్రాంతి పండుగ సీజన్‌లో వారం, పది రోజుల పాటు దుకాణాలు కళకళలాడేవి. నాలుగైదేళ్లుగా ఇది రెండు మూడు రోజులకు పడిపోయింది. ఇప్పుడైతే అసలు ఒక్క రోజన్నా తమ దుకాణాలకు కస్టమర్ల కళ రాకపోతుందా అని వ్యాపారులు ఎదురుచూస్తున్నారు.

వ్యాపార జోరు తగ్గింది



ఒకప్పుడు పండగ సమయంలో వ్యాపారం జోరుగా సాగేది. కనీసం లంచ్‌కు వెళ్లేందుకు కూడా వీలు కాని విధంగా కస్టమర్లు ఉండేవారు. పెద్దబజార్ నిండుగా కనిపించేది. ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చింది. కస్టమర్లు ఆన్‌లైన్, బడా షాపింగ్‌మాళ్లకు వెళ్లేందుకే ఆసక్తి చూపిస్తున్నారు.
– పల్లపోతు సాయిబాబ, కొత్తగూడెం యునైటెడ్ మర్చంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

పాత్‌వే కావాలి



చిన్నబజార్, పెద్దబజార్‌లకు రావడం వినియోగదారులకు ఇబ్బందిగా మారింది. కస్టమర్లు వాహనాలకు పార్కింగ్ జోన్లు కేటాయించాలి. అలాగే ఎంజీ రోడ్డు నుంచి చిన్నబజార్, పెద్దబజార్‌లకు సులువుగా వచ్చేలా పాత్‌వేలు అందుబాటులోకి తేవాలి.
–మొరిశెట్టి భవానీ ప్రసాద్, వ్యాపారుల సంక్షేమ సంఘం కన్వీనర్, కొత్తగూడెం

కృష్ణయ్య చెంత రాపత్తు సేవ





రామాలయంలో భక్తుల రద్దీ (ఇన్‌సెట్) నిత్యకల్యాణంలో స్వామివారు

రామాలయానికి పోటెత్తిన భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మిథిలా స్టేడియం పక్కనున్న శ్రీకృష్ణాలయంలో రామయ్యకు రాపత్తు సేవ నిర్వహించారు. తొలుత పల్లకీలో స్వామివారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా శ్రీకృష్ణాలయానికి తీసుకెళ్లి కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కనులపండువగా నిత్యకల్యాణం..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ..

రామాలయంలో గురువారం కూడా భక్తుల రద్దీ నెలకొంది. సంక్రాంతి సెలవులు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో సందడి నెలకొంది. గోదావరిలో పుణ్యస్నానాల అనంతరం స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు.

సర్వే పారదర్శకంగా ఉండాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



ములకలపల్లి మండలంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

ములకలపల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా చేపడుతున్న సర్వే పారదర్శకంగా సాగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కమలాపురంలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా సర్వే చేయాలన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హులైన వారినే లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. సాగు యోగ్యం కాని భూములను స్వయంగా పరిశీలించారు.

మంగపేట పీహెచ్‌సీ తనిఖీ..

మండల కేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేషెంట్లతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ జి.రేవతి, ఎంపీఓ లక్ష్మయ్య, మండల వ్యవసాయాధికారి అరుణ్‌బాబు, ఏఎస్‌ఓ దుర్గారావు, వైద్యాధికారులు సాయికల్యాణ్, కృష్ణ దీపక్ రెడ్డి, ఏఈఓ మనోహర్ ఉన్నారు.

దమ్మపేట మండలంలో..

దమ్మపేట : మండల పరిధిలోని పూసుకుంట, కటుకూరు గ్రామాల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం విస్తృతంగా పర్యటించారు. కొండరెడ్ల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. ఐటీడీఏ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రాయితీల గురించి వివరించారు.

23న ఏఏఐ బృందం రాక

- పాల్వంచ, కొత్తగూడెంలోని వలు ప్రాంతాల్లో పర్యటన
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలన



కేంద్ర మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించేందుకు ఈనెల 23న ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) టెక్నికల్ టీమ్ జిల్లాలో పర్యటిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ బృందం 20వ తేదీనే జిల్లాకు రావాల్సి ఉంది. ఈ అంశంపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మంత్రి తుమ్మల ఫోన్‌లో గురువారం మాట్లాడారు. దీనికి కేంద్రమంత్రి స్పందిస్తూ ఏఏఐ బృందం ఈనెల 20కి బదులు 23న వస్తుందని తెలిపారు.

ఆరుగురు సభ్యుల ప్రత్యేక బృందం..

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఆరుగురు సభ్యుల ప్రత్యేక బృందం 23వ తేదీన కొత్తగూడెం, పాల్వంచ పరిసర ప్రాంతాల్లో పర్యటించనుంది. ఈ బృందంలో అబ్దుల్ అజీజ్ (ఏరో ప్లానింగ్), మహ్మద్ సకీబ్(ఆర్కిటెక్ట్), ప్రశాంత్ గుప్తా (ఆపరేషన్స్), సీఎస్‌ఎస్‌ఆర్ దివాకర్ (ఆపరేషన్స్), మనీష్ జోన్వాల్, ఎఫ్‌పీడీ ప్రవీణ్ ఉన్ని కృష్ణన్ ఉన్నారు. వీరి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ, అటవీ, వాటర్ రిసోర్సెస్ శాఖల అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

రూపురేఖలు మారుతాయి

విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయి. వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వాణిజ్యపరంగా, పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం దోహదం చేస్తుంది. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలానికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేందుకు ఈ విమానాశ్రయం ఉపయోగపడుతుంది.
– తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర మంత్రి

నిబంధనల మేరకే ఎంపిక జరగాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



సారపాకలో సర్వేను పరిశీలిస్తున్న పీఓ రాహుల్

బూర్గంపాడు: నిబంధనల మేరకే లబ్ధిదారుల ఎంపిక జరగాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అధికారులకు సూచించారు. సారపాక పంచాయతీలోని పాత సారపాక, కండక్టర్స్ కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం అయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల కోసం అధికారులు పారదర్శకంగా పరిశీలన జరపాలన్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి స్థితిగతులను పరిశీలించి అర్హులను గుర్తించాలన్నారు. దరఖాస్తుదారుల సంవత్సర ఆదాయం గ్రామాల్లో రూ.1.50 లక్షలు, పట్టణాలలో రూ. 2లక్షలకు మించకూడదని, మూడున్నర ఎకరాల లోపు మాగాణి, ఐదెకరాల వరకు మెట్టభూములు ఉన్నవారే అర్హులని తెలిపారు. పక్కా ఇల్లు లేనివారిని, కూలిపనులకు వెళ్లే వారిని అర్హుల జాబితాలో చేర్చాలన్నారు. భూమి లేని నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడే వారి కుటుంబాలు, హెచ్‌ఐవీ, కుష్ఠు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు తప్పనిసరిగా రేషన్‌కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ శంకర్, ఏఎస్‌ఓ ప్రదీప్, సారపాక, నాగినేనిప్రోలు గ్రామపంచాయతీల కార్యదర్శులు మహేష్, బాలయ్య పాల్గొన్నారు.

నిరీక్షణకు ఇక తెర..

- ఈనెల 26 నుంచి రేషన్‌కార్డుల పంపిణీకి ప్రణాళిక
- జిల్లాలో 35 వేల మందికి పైగా ఎదురుచూపులు
- ప్రభుత్వ పథకాలు అందక అవస్థలు



కొత్తగూడెంఅర్బన్: ఏళ్ల తరబడి రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హుల నిరీక్షణకు ఇక తెరపడనుంది. ఈనెల 26 నుంచి రేషన్‌కార్డులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు, మంజూరు, పంపిణీ ప్రక్రియపై రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా అధికారులకు టెలీ, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సూచనలు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 35 వేల మంది తమకు రేషన్ కార్డులు ఎప్పుడొస్తాయా అని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ రేషన్ కార్డును ప్రామాణికం చేస్తుండడం, విద్యార్థులకు ఆదాయ ధ్రువీకరణకూ రేషన్‌కార్డును తప్పనిసరి చేయడంతో కార్డులు లేనివారు ఇంతకాలం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ఉచిత బియ్యం కూడా పొందలేకపోతున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డుల జారీపై పలు దఫాలు చర్చించారు. గతేడాది సెప్టెంబర్‌లోనే కొత్త కార్డుల పంపిణీ ఉంటుందనే ప్రకటనతో అంతా ఆశగా ఎదురు చూశారు. ఎట్టకేలకు ఈనెల 26 నుంచి పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అర్హులైన వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

రేషన్‌కార్డే ప్రధానం..

ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డే ప్రధానం కావడంతో జిల్లాలో కార్డు లేని వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వర్తింపు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రుణాలు.. ఇలా అన్నీ రేషన్‌కార్డు ఉంటేనే లబ్ధి జరుగుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రకటనతో కొంత ఊరట లభించినట్టయింది.

మార్పులు, చేర్పులకూ మోక్షం!

ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల సందర్భంగా జిల్లాలో 54,096 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేస్తున్నారు. వీటితో పాటు ప్రస్తుతం ఉన్న కార్డుల్లో కొత్తవారి పేర్ల నమోదు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు కోసం మరో 20 వేల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. గురువారం నుంచి అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. దీంతో అర్హులందరికీ లబ్ధి చేకూరనుందని తెలుస్తోంది. వచ్చే మార్చి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఈలోగా తమకు కార్డులు వస్తాయా అని పలువురు ఎదురుచూస్తున్నారు. అర్హత ఉన్న వారందరికీ కార్డులు మంజూరైతే జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య 3 లక్షలకు పైగా ఉంటుంది.

జిల్లాలో రేషన్ కార్డుల వివరాలిలా..	ఆహార భద్రత కార్డులు	అంత్యోదయ కార్డులు	మార్పులు, చేర్పుల దరఖాస్తులు	కొత్తగా దరఖాస్తు చేసినవారు	జిల్లాలో రేషన్ షాపులు	ప్రతీ నెల వస్తున్న బియ్యం
	2,79,190	18,822	20,000	54,096	443	5,411 మెట్రిక్ టన్నులు

కిన్నెరసానికి తగ్గని పర్యాటకుల రద్దీ

ఒకరోజు ఆదాయం రూ.57,865



కిన్నెరసాని బోటింగ్ పాయింట్ వద్ద పర్యాటకులు

మండల పరిధిలోని కిన్నెరసానికి నాలుగు రోజులుగా పర్యాటకుల రద్దీ తగ్గడం లేదు. గురువారం కూడా భారీగా తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 1,084 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.35,565, 450 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.22,300 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. – పాల్వంచరూరల్

క్లుప్తంగా

పరిశీలన పారదర్శకంగా సాగాలి



లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ దామోదర్‌రావు

బూర్గంపాడు: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అర్హుల ఎంపికకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన పారదర్శకంగా జరగాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హుల ఎంపికలో ఎలాంటి ఒత్తిళ్లకు గురికావొద్దన్నారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఏఓ శంకర్, ఆర్ఐ నర్సింహారావు, ఎస్కే హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలగొద్దు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్ఎం సరిరామ్

చుంచుపల్లి: ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ సూచించారు. గురువారం ఆయన కొత్తగూడెం బస్టాండ్‌లో పండుగ ప్రయాణికుల తిరుగు ప్రయాణ రద్దీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులకు బస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. హైదరాబాద్‌కు అదనపు ట్రిప్పులు నడిచేలా చూడాలన్నారు. శుక్ర, శనివారాల్లో రద్దీ మరింతగా ఉండే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా బస్సులు నడపాలన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ పేరుతో టోకరా

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తి ఫేక్ ఫోన్ కాల్ చేసి నగదు కాజేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ నిర్వాహకులకు గురువారం ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను మున్సిపల్ కమిషనర్‌ని, మీ ట్రేడ్ లైసెన్స్ ఫీజు పెరిగిందని, ఆ మొత్తం ఫోన్ పే చేయాలని సూచించారు. దీంతో నిర్వాహకులు ఫోన్ పే చేశారు. కొద్దిసేపటి తర్వాత తేరుకున్న పెట్రోల్ బంక్ యజమాని ఫోన్ నంబర్‌ను పరిశీలించగా ఫేక్ నంబర్‌గా తేలింది. ఇది సైబర్ నేరగాళ్ల పనేనని పోలీసులు భావిస్తున్నారు. కాగా కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తన పేరుతో ఎవరైనా ఫోన్ చేసే డబ్బులు అడిగితే ఇవ్వొద్దని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

భద్రాచలంలో ఎన్సీడీ సర్వేలో స్క్రీనింగ్ చేస్తున్న వైద్య సిబ్బంది



బీ కేర్‌ఫుల్.. 30 ఏళ్లకే బీపీ, షుగర్

- మారుతున్న జీవనశైలితో పెరుగుతున్న బాధితులు
- జిల్లాలో కొనసాగుతున్న ఎన్సీడీ సర్వే
- నియంత్రణ కోసం వైద్యారోగ్య శాఖ చర్యలు

భద్రాచలంఅర్బన్: ఉరుకులు, పరుగుల జీవితంలో వేళకు సరైన ఆహారం తీసుకోకపోవడం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, తగిన విశ్రాంతి లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాలతో పలువురు బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. గతంలో 50 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే బీపీ, మధుమేహం కనిపించేవి. ప్రస్తుతం 30 ఏళ్ల దాటిన వారిలో బీపీ, షుగర్ సమస్యలు వస్తున్నాయి. ఈ వ్యాధులను అదుపులో ఉంచేందుకు జీవితాంతం మందులు వాడాలని, వ్యాయామం చేయాలని, ఆహార నియమాలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

జిల్లాలో 3,41,528 మందికి స్క్రీనింగ్..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్సీడీ సర్వే నిర్వహిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు బాధితుల వివరాలు సేకరిస్తున్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు ఇలా అన్నింటిలోనూ జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్సీడీ సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే వేలాది మందిలో బీపీ, షుగర్ ఉన్నట్లు గుర్తించి, వారి వివరాలను వెబ్ పోర్టల్‌లో నమోదు చేసి ఎన్సీడీ కార్డు ఇస్తున్నారు. ఈ కార్డులో పేషెంటు పేరు, అందిస్తున్న చికిత్స, మందుల వివరాలు పొందుపరుస్తున్నారు. ప్రతీ నెల సరిపడా మందులు ఆశావర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా అందించనున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు సర్వేలో వెల్లడవుతోంది. జిల్లాలో ఎన్సీడీ ప్రోగ్రాం ద్వారా 30 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్, మహిళలకు రొమ్ము, గర్భాశయ, నోటి కేన్సర్ పరీక్షలు చేస్తున్నారు. 30 ఏళ్ల పైబడిన 5,43,269 మందిని పరీక్షించాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఈ నెల 15 వరకు 3,41,528 మందికి స్క్రీనింగ్ చేసినట్లు వైద్యారోగ్య శాఖాధికారులు చెబుతున్నారు. ఇందులో 83,929 మంది బీపీ, 42,970 మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు పేర్కొంటున్నారు. కాగా ఇప్పటికే 38,868 మంది బీపీ, 18,472 మంది మధుమేహంతో బాధపడుతూ ప్రభుత్వ వైద్యం పొందుతున్నారు.

చికిత్స తీసుకోకపోతే అనేక సమస్యలు..

బీపీ, షుగర్ వల్ల జనం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. బీపీతో గుండె సంబంధిత వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్, పెరాలసిస్, శరీరంలోని ఇతర అవయవాలు చెడిపోవడం, కంటి సమస్యలు రావడం, రక్తం గడ్డ కట్టి పక్షవాతం వంటి సమస్యలకు గురవుతారు. బీపీ ఎక్కువై నరాలు చిట్లిపోయి చనిపోతున్నారు. ఇక షుగర్ వల్ల నరాల బలహీనత, కాళ్లకు తిమ్మిర్లు రావడం, కిడ్నీలు చెడిపోవడం, కంటిసమ స్యలు, శరీరంలో అన్ని అవయవాలకు ఇన్ఫెక్షన్ రావడం తోపాటు రోగనిరోధక శక్తి తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్యాంక్రియాస్ గ్రంధి ఇన్సులెన్ రిలీజ్ చేయకపోవడంతో షుగర్ పెరిగి డయాబెటిస్ దారి తీస్తుందని పేర్కొంటున్నారు. వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల రొమ్ము కేన్సర్, లైంగిక సంబంధాలతో సర్వైకల్ కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

బాధితులను గుర్తిస్తున్నాం



ఎన్సీడీ సర్వే ద్వారా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నాం. వారికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందించడంతోపాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాం. బీపీ, షుగర్ బారిన పడ్డ వారిలో ఇతరత్రా అవయవాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి. వ్యాధులను అదుపులో ఉంచుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్.వి.మధువరన్, జిల్లా ఎన్సీడీ అధికారి

వ్యాయామం చేయాలి



30–35 ఏళ్ల వయసు వారిలో మధుమేహం, రక్తపోటు ఎక్కువగా కనిపిస్తోంది. కూర్చున్న చోటు నుంచే అన్ని పనులు చేయడం, జంక్ ఫుడ్ తినడం, ఒత్తిడి మూలంగా రక్తపోటు, మధుమేహం సమస్యలు వస్తున్నాయి. వీటిని అధిగమించేందుకు రోజూ ఉదయం చేతులు ఊపుతూ కనీసం అర గంట నడవాలి. ఉప్పు, నూనెలు, కొవ్వు పదార్థాలు తక్కువగా తినాలి. పీచు పదార్థాలు, కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి. తినాలి.

– డాక్టర్ సీతారామరాజు, ఎండీ, భద్రాచలం

మధురస్మృతులతో తిరుగు పయనం

- ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ
- సొంతూళ్లలో మూడు రోజులపాటు సంక్రాంతి వేడుకలు



కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

చుంచుపల్లి: సంక్రాంతిని జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యా, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు కూడా సొంతూళ్లకు వచ్చి బంధుమిత్రులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. అమ్మమ్మ, తాతయ్యల ఇంటికి వచ్చిన చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో మెరిసి వారిని ఆనందడోలికల్లో ముంచెత్తారు. పండుగ వేళ వృద్ధులు మనవళ్లు, మనవరాళ్లతోనే ఎక్కువ సమయం గడిపారు. వారి తిరిగి వెళ్లేటప్పుడు వృద్ధుల మనసులు తల్లడిల్లాయి. వేడుకల్లో బంధుమిత్రులు, ఆత్మీయులతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. అందరూ మధుర స్మృతులతో తిరుగు పయనమయ్యారు. దీంతో గురువారం ఉదయం నుంచి ఆర్టీసీలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. కొత్తగూడెం, భద్రాచలం, పాలవ్వంచ, ఇల్లెందు, మణుగూరు ప్రధాన బస్టాండ్లు అన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ రూట్ వైపు వెళ్లే ప్రతి బస్సు సర్వీసు నిండిపోయి కనిపిస్తోంది.

బాగా ఎంజాయ్ చేశాం

పండుగకు దమ్మపేటలోని అత్తగారింటికి ఇంటికి వచ్చాం. కుటుంబ సభ్యులందరం 15 ఏళ్లుగా సంక్రాంతికి ఇక్కడే కలుస్తుంటాం. మూడు రోజులు సంతోషంగా గడుపుతాం. ఈ సారి పాపికొండల టూర్ కూడా పెట్టుకున్నాం. పాపికొండల నడుమ గోదావరిలో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించాం. సంక్రాంతిని మరింతగా ఎంజాయ్ చేశాం.

– చలువాది రాజేష్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, హైదరాబాద్

ఆటపాటలతో..



సంక్రాంతి పండుగకు ప్రతీసారి అమ్మగారిపల్లి(అశ్వాపురం)లోని పెద్దనాన్న ఇంటికి వస్తుంటాం. ఈ పండుగ మాకు ప్రత్యేకం. మూడు తరాలవాళ్లు కలుసుకుని చిన్నా,పెద్ద తేడా లేకుండా ఆట, పాటలతో సందడి చేశాం. తీపి గుర్తులతో తిరిగి వెళ్తున్నాం.

–యామిని, హైదరాబాద్

అందరూ రావాల్సిందే...



ప్రతీ సంక్రాంతి పండుగకు కుటుంబ సభ్యులందరూ మా వూరు రావాల్సిందే. మా ఇంట్లో సంక్రాంతి అతి పెద్ద పండుగ. ఎవరెవరు ఎక్కడ ఉన్నా సంక్రాంతికి ఇక్కడకు వస్తారు. పండుగ వేళ మేమందరం కూడా పిల్లల్లతో ఎంతో ఆనందంగా, సరదాగా గడిపాం.

–గాదె వెంకటరెడ్డి, అమ్మగారిపల్లె

బోటింగ్‌పై ప్రచారం చేయాలి



బోటింగ్ నిర్వాహక మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అశ్వాపురం: పర్యాటకుల సంఖ్య పెరిగేలా తుమ్మల చెరువులో బోటింగ్‌పై ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. మండల పరిధిలోని కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువును గురువారం ఆయన సందర్శించారు. ఇటీవల తుమ్మలచెరువులో బోటింగ్ ప్రారంభంకాగా, బోటింగ్ తీరును, పర్యాటకుల ఆదరణపై నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 మంది ప్రయాణికులు పట్టే బోటు ఏర్పాటు విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. పర్యాటకులకు తెలిసేలా భద్రాచలం వద్ద కూడా బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి దినేష్, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియ తనిఖీ

మణుగూరు రూరల్ : రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు మండలంలోని గుట్టమల్లారం, కట్టుమల్లారం గ్రామపంచాయతీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ గురువారం తనిఖీ చేశారు. లబ్ధిదారుల గుర్తింపు, వివరాల సేకరణపై ఆరా తీశారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

5 కేజీల కణితి తొలగింపు



ఆపరేషన్ చేసి కణితి తొలగించిన వైద్యులు

కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఓ మహిళకు శస్త్ర చికిత్స చేసి ఐదు కేజీల కణితి తొలగించారు. పాత కొత్తగూడేనికి చెందిన కృష్ణవేణి ఈ నెల 10న కడుపు నొప్పితో జిల్లా సర్వజన ఆస్పత్రిలో చేరింది. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో ఐదు కేజీల కణితి ఉన్నట్లు గుర్తించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నవ్యదీప్ గురువారం సర్జరీ చేసి తొలగించారు. తొలగించకపోతే కణితి పగిలి ప్రాణా పాయం జరిగేదని డాక్టర్ తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రవీణ్, నర్సింగ్ ఆఫీసర్ వేద, రత్న, హేమ, ఆది తదితరులతో శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధామోహన్ అభినందించారు.

సమయపాలన పాటించాలి

కొత్తగూడెంరూరల్: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ ఎల్. భాస్కర్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వైద్యఆరోగ్యకేంద్రంలో గురువారం ప్రోగ్రాం ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేటాయించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లక్ష్యాలను అధిగమించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎం.సుకృత, డాక్టర్ బాలాజీ, డాక్టర్ చైతన్య, డాక్టర్ స్పందన, డాక్టర్ మధువరన్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలకుంట కాలనీ గ్రామ శివారులోని మామిడి తోటలో ఏర్పాటు చేసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3500 నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో ఈనెల 14న పెట్రోల్ బంక్‌లో జరిగి న దాడి ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సోమేశ్వర్ తెలిపారు. పెట్రోల్ కోసం వచ్చిన చంద్రశేఖర్ అనే వ్యక్తి పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న గణేష్‌తో ఘర్షణ పడి దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను విస్మరించొద్దు

మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను విస్మరిస్తోందని, తక్షణం అమలు చేయకపోతే తమ సత్తా ఏంటో చూపిస్తామని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7 హైదరాబాద్‌లో చేపట్టబోయే వేల గొంతుకలు, లక్ష డప్పుల ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం పట్టణంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో సమాయత్త సదస్సు నిర్వహించారు. తొలుత అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి డప్పులు కొట్టుకుంటు వచ్చారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేస్తే 59 కులాలకు మేలు జరుగుతుందన్నారు. కానీ తమకు అవకాశాలు తగ్గుతాయని మాలలు అడ్డుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఉప కులాల సంఘ నాయకులు కొత్తపల్లి సోమయ్య, దాసరి శ్రీనివాసరావు, కత్తి శ్రీను, సమ్మయ్య, మిరాయాల వెంకటేశ్వర్లు, సిద్దెల హుస్సేన్, వీరభద్రం, రాంబాబు, సూర్యరాణి తదితరులు పాల్గొన్నారు.

రాణా ఎదుట గుమిగూడిన జనం

కొత్తగూడెంఅర్బన్: బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో దాడి చేయని వ్యక్తిపై కూడా కేసు పెట్టారని బంధువులు కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్ ఎదుట గురువారం గుమిగూడారు. ఇటీవల బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌పై దాడి చేసిన ఘటనలో ఉదయ్ అనే వ్యక్తి దాడిని అడ్డుకున్నాడని, అతనిపై కేసు నమోదు చేయడం సరికాదంటూ బంధువులు ఆందోళన చేయడానికి సిద్ధపడ్డారు. స్టేషన్ వద్దకు భారీగా జనాలు చేరారు. అనంతరం అక్కడి నుంచి కోర్టు వద్దకు వెళ్లిపోయారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పాల్వంచ మండలం ఉల్వనూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అశ్వాపురం మండలం గొందిగూడెంలో ఫంక్షన్‌కు వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో మొండికుంట వద్ద మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108లో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మరో ప్రమాదంలో ఇద్దరికి...

గరిడేపల్లి: టాటా ఏస్ వాహనాన్ని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం క్రాస్ వద్ద జరిగింది. ఖమ్మం జిల్లా తల్లంపాడుకు చెందిన దేరంగుల సురేష్, ఆయన సోదరి దేరంగుల యమున సంక్రాంతి పండుగకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శంచర్లలోని బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం తిరిగి స్వగ్రామానికి స్కూటీపై బయలుదేరగా గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం క్రాస్ వద్ద ముందు వెళ్తున్న టాటా ఏస్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వీరు ఢీకొట్టారు. ఈ ఘటనలో సురేష్, యమునకు తీవ్ర గాయాలు 108లో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థికంగా ఎదగాలి

పెనుబల్లి: ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తూ జీవితంలో ఎదగాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పెనుబల్లికి చెందిన మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన ఐదు ఇందిరా మహిళా శక్తి యూనిట్లను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా అందించే తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటే ఫలితం ఉంటుందన్నారు. యూనిట్ ఏర్పాటు సమయాన మార్కెటింగ్ అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. కల్లూరు ఆర్డీఓ రాజేందర్, అదనపు డీఆర్డీఓ నూరొద్దీన్, తహసీల్దార్ ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీరు వస్తేనే సాఫీగా..

- వైరా రిజర్వాయర్ ఆయకట్టులో రబీ సాగుపై ఆందోళన
- రిజర్వాయర్‌లో 13.1 అడుగుల మేర నీరు
- సాగు, తాగునీటి అవసరాల వినియోగంతో తగ్గుతున్న నీటిమట్టం



రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో నాట్లు వేస్తున్న కూలీలు

వైరా: ఖమ్మం జిల్లాలోని సాగు వనరుల్లో కీలకమైన వైరా రిజర్వాయర్‌లో నీటి మట్టం రోజురోజుకు పడిపోతోంది. ప్రస్తుత రబీలో రిజర్వాయర్ కింద సుమారు 15వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయనున్నారు. ఇప్పటికే కొందరు రైతులు నారుమడులు సిద్ధం చేసుకోగా, పలువురు నాట్లు కూడా వస్తున్నారు. అయితే, సాగర్ జలాలు విడుదల చేస్తే తప్ప రబీలో సాగు సాఫీగా సాగడం కష్టంగా కనిపిస్తోంది. మరోవైపు అధికారులు మార్చి చివర నుంచి రిజర్వాయర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. అదే జరిగితే రబీ సీజన్ చివరలో ఇక్కట్లు ఎదురుకావడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రోజుకు 33 క్యూసెక్కుల నీరు అవసరం

రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 18.4 అడుగులు కాగా, ఖరీఫ్‌లో 25 వేల ఎకరాల్లో ఆయకట్టు కింద వరి సాగు చేశారు. ఇక ప్రస్తుతం రబీలో వరితోపాటు మొక్కజొన్న తదితర పంటల సాగు కోసం రోజుకు 33క్యూసెక్కుల నీరు అవసరమవుతోంది. కుడి కాల్వ పరిధిలో 8వేల ఎకరాలు, ఎడమ కాల్వ పరిధిలో అంచనా మేరకు సాగులోకి రావాలంటే పూర్తి స్థాయి నీటి మట్టం మేర ఉండాలి. ఇప్పటికే సుమారు 2వేల ఎకరాల్లో వరి నాట్లు వేయగా, ఖరీఫ్ వరి పంట కోతలు వారంలోగా పూర్తయ్యాక రబీ సాగు విస్తీర్ణం పెరగనుంది. రిజర్వాయర్‌లో 1.6 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ మార్చి చివరి వరకు సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు. సాగర్ జలాలను వైరా రిజర్వాయర్‌కు చేరిస్తే తప్ప రబీ గట్టెక్కడం కష్టంగా మారుతుందని చెబుతున్నారు.

25 నుండి వారబందీ

వైరా రిజర్వాయర్‌కు వర్షాధారంగా తప్ప ఇతర మార్గాల్లో నీరు వచ్చే అవకాశం లేక ఏటా వేసవిలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఫలితంగా ప్రతీ సంవత్సరం వేసవిలో సాగర్ జలాలు విడుదల చేస్తేనే అటు సాగు, ఇటు తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. ఈసారి అవసరాలు పెరగనుండడంతో ఈనెల 25నుండి ఆయకట్టుకు వారబందీ విధానంలో నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. వారం పాటు నీరు ఇచ్చి మరో వారం పాటు నిలిపివేయాలని ఇప్పటికే కార్యాచరణ రూపొందించారు. అయినప్పటికీ సాగర్ జలాలు విడుదల చేస్తే తప్ప మరో రెండు నెలల తర్వాతైనా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి లేకపోలేదు. ప్రస్తుతం రోజుకు 33 క్యూసెక్కుల మేర నీరు సాగుకు, మరో 37 క్యూసెక్కుల నీటని మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు. రోజుకు ఈ 70 క్యూసెక్కులు కాక ఆవిరి రూపంలో మరో 3 క్యూసెక్కుల నీరు వృథా అవుతుండగా నీటిమట్టం పడిపోతోంది.

మార్చి చివరిలో ఆధునికీకరణ

రిజర్వాయర్ ఆధునికీకరణ పనులకు రూ.42 కోట్లు మంజూరు చేయగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఈ నెలాఖరుకు అగ్రిమెంట్లు చేసి మార్చి చివరి నుండి పనులు ప్రారంభించేందుకు జల వనరుల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రిజర్వాయర్ 12వ నంబర్ తూము నుండి గైడ్‌వాల్స్‌ను, 8వ నంబర్ తూము కోస్తాల నుంచి గొల్లపూడిలోని 16వ నంబర్ తూము వరకు ఆధునికీకరించేలా ప్రణాళిక సిద్ధమైంది. ఈనేపథ్యాన అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందిస్తే రబీలో వరి, మొక్కజొన్న పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీరు విడుదల చేయడం సాధ్యమవుతుంది. లేకపోతే సాగుకే కాక తాగు అవసరాలకు ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది.

ఉన్నతాధికారులకు విన్నవించాం..

వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రబీలో వరి సాగుకు ప్రస్తుతం ఉన్న నీరు సరిపోయేలా లేదు. ఈ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సాగర్ జలాలు రిజర్వాయర్‌లోకి విడుదల చేస్తే సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– శ్రీనివాస్, జల వనరుల శాఖ డీఈ

కేసు నమోదు

పాల్వంచ: ముగ్గురు మైనర్లతో పనిచేయిస్తున్న హోటల్ నిర్వాహకుడిపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు ఎస్ఐ నాగభిక్షం, ఏసీటీఓ నాగరాజు, పీసీ హుస్సేన్, కృష్ణ ప్రసాద్, డబ్ల్యూసీ ఊర్మిల పట్టణంలోని పలు రెస్టారెంట్లు, బిల్డింగ్‌లు, మార్బుల్ షాపుల్లో తనిఖీలు చేశారు. ముగ్గురు బాలకార్మికులను గుర్తించారు. డీసీపీయూ సోషల్ వర్కర్ తేజావత్ బాబు ఫిర్యాదు మేరకు రెస్టారెంట్ నిర్వాహకుడు శేషగిరిరావుపై ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేశారు.

గొంతులో గారె ఇరుక్కుని వృద్ధురాలు మృతి

తల్లాడ: పండుగ వేళ కుమారుడు పంపించిన గారెలు తినే క్రమంలో గొంతులో ఇరుక్కోగా ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన మొక్కా తిరపతమ్మ(80) పెద్దకుమారుడితో కలిసి ఉంటుంది. కనుమ పండుగ సందర్భంగా బుధవారం ఆమెకు మరోచోట ఉండే చిన్న కుమారుడు గారెలు, చికెన్ పంపించాడు. అయితే, తిరపతమ్మకు దంతాలు సరిగా లేక నేరుగా మింగేందుకు యత్నిస్తుండగా గారె గొంతులో ఇరుక్కుపోయినట్లు తెలిసింది. దీంతో ఊపిరి ఆడక ఆమె మృతి చెందింది. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

కల్లూరు: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కల్లూరుకు చెందిన కారు మెకానిక్ మొగిలిచర్ల ప్రతాప్ (38) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఈనెల 15న పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు కల్లూరులో చికిత్స చేయించి ఖమ్మం తరలించగా పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. ఘటనపై ఆయన సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.